ప్రజాశక్తి

బుధవారం 20 సెప్టెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

నాడు-నేడుకు నిధుల కొరత

వినుకొండ పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో నిధుల్లేక నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

- బిల్లులు రాక అప్పులపాలయ్యామని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్ల ఆవేదన
- పెండింగ్‌లో రూ.182 కోట్లు
- 40 శాతం పనులు అసంపూర్తి

ప్రజాశక్తి - వినుకొండ

ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక వసతుల మెరుగు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల కొరతే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. నాడు-నేడు పనులు చేయించాలని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లపై అధికారులు ఒత్తిళ్ల చేస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారు అప్పులు తెచ్చి పనులు చేయాల్సి వచ్చిందని, ఏడాది దాటినా బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఎ

నాడు-నేడు పథకం రెండో దశలో భాగంగా పల్నాడు జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు - 608, హై స్కూల్స్-172,

పెచ్చులూడుతున్న పాఠశాల భవనం శ్లాబ్

ప్రాథమిక ఉన్నత పాఠశాల-103, కళాశాలలు-9, అంగన్వాడి సెంటర్లు-13 మొత్తం 905 ప్రభుత్వ విద్యాసంస్థలను ఎంపిక చేశారు. ఇందుకుగాను రూ.307.36 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి వరకు రూ.181 కోట్లు విడుదల చేయగా మిగతా నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. నాడు-నేడు ద్వారా ఏడాది కిందట చేపట్టిన పనుల్లో దాదాపు 40 శాతం పనులు ఇంకా అసంపూర్తిగా మిగిలాయి.

అదనపు తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్లు, ప్రసహరీ, తాగునీటి వసతి, క్రీడా పరికరాలు తదితర సదుపాయాలు నాడు-నేడు కింద సమకూర్చాల్సి ఉంటుంది. పనులు పూర్తి చేయాలని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్ల, కిందిస్థాయి అధికారులపై ఉన్నతాధికారులు ఒత్తిడి చేశారు. తరచూ వీడియోకాన్ఫరెన్స్‌లు నిర్వహించి పనుల పురోగతిపై పలుమార్లు సమీక్షించారు.

జిల్లాలో అనేక విద్యాసంస్థల్లో అదనపు తరగతి గదులు, బండ పరుపు, కాంపౌండ్ వాల్స్, కనీసం మరుగుదొడ్లు లేవు. నాడు-నేడు పథకం ద్వారా ▶ 2లో

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కెవిఎస్ లక్ష్మణరావు, పాశం రామారావు తదితరులు

27న జాషువా జయంతి సభ

ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డికి గుర్రం జాషువా కవితా పురస్కార ప్రదానం

ప్రజాశక్తి - గుంటూరు

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతి సభను 27న సాయంత్రం 4 గంటలకు గుంటూరు 2/7 బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తామని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు కరపత్రాన్ని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరే గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అందచేస్తున్న కవితా పురస్కారాన్ని 2023 సంవత్సరానికిగాను ప్రముఖ అభ్యుదయ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డికి ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. సభలో మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రమణ్యం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, అభ్యుదయ ▶ 2లో

8లో

చేనేత, హస్త కళలను ఆదరిద్దాం

ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో అధికారులు - 25 వరకు ప్రదర్శన, విక్రయాలు

సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న పేదలు, నాయకులు

ఉన్న ఇళ్లకే పట్టాలివ్వాలి

సిపిఎం ఆధ్వర్యంలో పేదలు ధర్నా, వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాము నివసిస్తున్న చోటనే ఇంటికి పట్టా ఇవ్వాలని పేదలు ఐక్యమయ్యారు. సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కృష్ణుని గుడి వద్ద గల ఐదో సచివాలయం, తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్దకు పెద్దఎత్తున తరలివచ్చి ధర్నా చేశారు. తాము నివాసం ఉంటున్న నివాసాలను రెగ్యులరైజేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే పేదల ఆందోళనపై సచివాలయ అధికారులు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. కనీసం అర్జీలు తీసుకోవడానికీ నిరాకరించారు. సచివాలయం వద్ద అర్జీలు స్వీకరించకపోవడంతో అక్కడ నుంచి మున్సిపల్ జోనల్ కార్యాలయం వరకు పేదలు ప్రదర్శన నిర్వహించారు. ఇక్కడ కాదు అక్కడ.. అక్కడ కాదు ఇక్కడ ఇవ్వండని అధికారులు చెప్పడంతో పేదల ▶ 2లో

భార్య, చంటిబిడ్డను చూడ్డానికి వెళ్తూ...

6లో

రోడ్డు ప్రమాదంలో డప్పు కళాకారుడు మృతి

అభివృద్ధి పనులకు ఆమోదం

గుంటూరు నగర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కృషి : మేయర్

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం కృషి చేస్తుందని నగర మేయర్, స్థాయిసంఘ అధ్యక్షులు కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. నగర పాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం మేయర్ ఛాంబర్‌లో మంగళవారం నిర్వహించి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. అన్ని డివిజన్లకు సంబంధించిన ▶ 2లో



సమావేశంలో మేయర్, సభ్యులు

27న జాషువా జయంతి సభ

(మొదటి పేజీ తరువాయి)

రచయితల సంఘం అఖిలభారత అధ్యక్షులు పెనుకొండ లక్ష్మీనారాయణ, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. నాటి సామాజిక వ్యవస్థలో ఉన్న రుగ్మతలకు వ్యతిరేకంగా ప్రజలను గుర్రం జాషువా సాహిత్యం చైతన్యం చేసిందని, నేటి సామాజిక పరిస్థితుల్లో జాషువా సాహిత్యానికి చాలా ప్రాధాన్యం ఉందని చెప్పారు. జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటినా కుల వివక్ష, అంటరానితనం, దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. కుల, మత, ప్రాంతీయతత్వాలు రెచ్చగొట్టబడ్డాయన్నారు. వీటికి వ్యతిరేకంగా జాషువా తన కళాన్ని ఝుళిపించారని, మూఢ నమ్మకాలపై జాషువా సాహిత్యం యుద్ధం ప్రకటించిందని అన్నారు. ఈ సాహిత్యాన్ని ప్రజలందరికీ చేర్చాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఇ.అప్పారావు, బి.శ్రీనివాసరావు, ఎంఎ.చిస్టీ, ఎం.కిరణ్ పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న ప్రవీణ్‌ప్రకాష్ (ఫైల్)

నాడు-నేడుకు నిధుల కొరత

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో ఆశించిన పురోగతి లేదు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 28 మండలాల్లోని పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వస్తువులు లేక నేటికీ అనేక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లాలో అనేక చోట్ల పాఠశాలలు, కళాశాలలు, హైస్కూళ్లలను ఆకస్మిక తనిఖీలు చేశారు. అనేకచోట్ల హైస్కూల్లో సైతం విద్యార్థులు కింద కూర్చొని చదవటాన్ని గుర్తించి ఆయన అసంతృప్తికి గురయ్యారు. నాడు-నేడు పథకం ద్వారా వేల కోట్లు ఖర్చు చేస్తుంటే పిల్లలు కింద కూర్చొని చదవటం ఏమిటని జిల్లా అధికారులపై మండిపడ్డారు. బెంచీలు లేని స్కూళ్ల వివరాలు సేకరించి వెంటనే అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపాలని సమగ్ర శిక్ష అభియాన్ అధికారిని ఆదేశించడం జరిగింది. ఏడాది దాటిన నాడు నేడు పథకం నిధులు పూర్తిగా విడుదల కాకపోవడంతో బెంచీలు కొనుగోలు సాధ్యపడలేదని జిల్లా అధికారి బదులు ఇవ్వడంతో ఆయనపై ఆగ్రహించారు.

అనేక పాఠశాలల్లో విద్యార్థుల తరగతి గదులు శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో కారుతూ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల పెచ్చులు ఊడి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అనేక పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ లేక బహిర్భూమికి ఆరు బయటకు వెళ్లే దుస్థితి లేకపోలేదు. నిధుల్లేక అనేక చోట్ల పనులు నిలిచిపోతే మొదటి విడత నాడు-నేడులో అరకొరగా మిగిలిన నిధులను బదలాయిస్తూ రోజులు గడుపుతున్నారు. రెండు వారాల్లో అనేకచోట్ల పనులు పూర్తిగా నిధులు లేక నిలిచిపోయే పరిస్థితి ఉన్నట్లు పలువురు ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. అంచనాల ప్రకారం మంజూరు చేసిన నాడు - నేడు పథకం నిధులను పూర్తిగా విడుదల చేస్తేనే పనులు జరుగుతాయని అంటున్నారు.

పనులకు ఇబ్బంది లేకుండా చర్యలు

శామ్యూల్, పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి

పల్నాడు జిల్లాకు నాడు-నేడు ద్వారా రూ.307.36 కోట్లు మంజూరవగా రూ.181 కోట్లు విడుదలయ్యాయి. మిగిలిన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. జరుగుతున్న పనులకు ఉన్న నిధులతోనే సర్దుబాటు చేస్తున్నాం. ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రసవం అనంతరం మృతి - కుటుంబీకుల ఆందోళన

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

జిజిహెచ్‌లో ప్రసవ అనంతరం 17వ తేదీన మృతి చెందిన కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన ఇశంకర జనని కుటుంబ సభ్యులు మంగళవారం జిజిహెచ్ ఎదుట ఆందోళన చేశారు. వ్యాపార నిమిత్తం నగరంలోని రత్నగిరి కాలనీలో నివాసం ఉంటున్న తమ డిగ్రీ చదువుతున్న బిడ్డను నాదెండ్ల మండలం, సాతులూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బండారు ఆనంద్ ప్రేమ పేరుతో ఇంట్లోంచి తీసుకెళ్లి మాయమాటలు చెప్పి తమకు ఇష్టం లేకున్నా పెళ్లి చేసుకున్నాడు అన్నారు. గర్భం దాల్చిన తర్వాత పుట్టింటికి పంపకుండా భర్త, అత్తింటి సభ్యులు పట్టించుకోకుండా వేధించారని వారి నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డను పోగొట్టుకున్నామని జనని తల్లి శంకర్ లీలా భావోద్వేగానికి గురయ్యారు.తన పరిస్థితి ఏ తల్లికి రాకూడదని ప్రేమ పేరుతో తమ బిడ్డని తన నుండి దూరం చేసి మోసం చేయడమే కాకుండా గర్భ సమయములో భార్యను పట్టించుకోకుండా ఉన్న ఆనంద వారి కుటుంబ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ 17వ తేదీ రాత్రి జి.జి.హెచ్‌కు గర్భంలోని ఉమ్మనీరు పోయి అపస్మారక స్థితిలో వచ్చిన జననీని అత్యవసర విభాగానికి తరలించి చికిత్స నిర్వహించామన్నారు. 10 గంటల సమయంలో పాపకు జన్మనిచ్చి రెండు గంటల సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. పుట్టిన బిడ్డను తండ్రి ఆనందుకు అప్పగించామన్నారు. ఈ ఘటనపై నల్లపాడు ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జీజీహెచ్ వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళన

ఆ జన్యువులో మార్పులున్న వారికి కరోనా ప్రమాదకరం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రొఫెసర్ జానకిరామయ్య

విదేశాలలో ఉన్న అత్యంత అధునాతన పరికరాలను ఉపయోగించి మెదడు క్యాన్సర్ పైన చేసిన పరిశోధనలకు గాను కేంద్ర పరిశోధన సంస్థ అయిన ఐసిఎంఆర్ నుండి అవార్డు అందుకున్న కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఆచార్యుడు డాక్టర్ జానకిరామయ్య బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధనలతో పాటు ఆచార్యుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన చేసిన మరో జన్యుపరమైన పరిశోధనలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయని బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలో పలు రకాల జన్యువులు ఉంటాయని అయితే టిఎల్ ఆర్7 అనే జన్యువు యొక్క జన్యుపరమైన మార్పులు కలిగి ఉన్న మనిషి శరీరంలోకి కోవిడ్ 19 వైరస్ కనుక ప్రవేశిస్తే వారిని కాపాడడం వైద్యుల తరం కాదని జానకిరామయ్య చేసిన పరిశోధనలో తేలిందన్నారు. పరిశోధకుడు, ఆచార్య డాక్టర్ జానకిరామయ్య మాట్లాడుతూ తన పరిశోధనా పత్రాన్ని సైంటిఫిక్ రిపోర్ట్ అనే జర్నల్ లో ప్రచురించినట్లు తెలిపారు. ఈ జర్నల్ నేచర్ గ్రూపుకు చెందినదిగా తెలిపారు. భవిష్యత్తులో టిఎల్ ఆర్ 7 అనే జన్యువు వలన టిఎల్.ఆర్7, ఎంవైడి88, ట్రాఫ్ కాంప్లెక్స్ కు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. వ్యాధి తీవ్రతను అర్థం చేసుకోవడానికి తాను నిర్మాణాత్మక అంశాలను కేంద్ర బిందువులుగా మార్చినట్లు పేర్కొన్నారు. కోవిడ్ 19 నుండి కోలుకున్న పురుషులలో టిఎల్ ఆర్7 అనే జన్యువులపైన తాను దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ పరిశోధన భవిష్యత్తులో బయో మార్కర్ పరిశోధనను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. దీని కోసం ఆయన పాశ్చాత్య దేశాలతో పాటు కింగ్స్ సౌద్ కళాశాల యొక్క టెక్నాలజీని ఉపయోగించినట్లు పేర్కొన్నారు. హైదరాబాదులో ఉన్న జీనోమిక్స్ కంపెనీ సహకారం తీసుకున్నట్లు తెలిపారు. దీంతో పాటు అధనంగా ఎం.టిఒఆర్ పాత్ వే వంటి జీవక్రియ మార్గాల ప్రమేయంపైన తాను లోతైన అధ్యయనాన్ని చేసి శాస్త్రీయ నేవేధికలను జీన్ రిపోర్ట్స్ లో ప్రచురించడంతో ప్రపంచవ్యాప్తంగా బహుళ గుర్తింపు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య జానకిరామయ్య కెఎల్ యు యాజమాన్యానికి, జీనోమిక్స్ కంపెనీ యోధా లైఫ్ లైన్ డయాగ్నోస్టిక్స్ ముఖ్య శాస్త్రవేత్తల అధికారి డాక్టర్ నౌషద్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ పరిశోధనకు సదరు జర్నల్ ఎడిటర్ నుండి అధికారికంగా శాస్త్రీయత లభించడంతో కెఎల్ వర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, పరిశోధనా ,అభివద్ధి డీన్ డాక్టర్ జయకుమార్ సింగ్, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాసులు అభినందించారు.

ఉన్న ఇళ్లకే పట్టాలివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. మున్సిపల్ జోనల్ కార్యాలయాన్ని ముట్టడించినంత పని చేశారు. ఎట్టకేలకు ఎంటిఎంసి రెవెన్యూ అధికారి మురళీ పేదల వద్దకు వచ్చి సచివాలయ అడ్మిన్‌ను పిలిపించి అర్జీలు స్వీకరించి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో పేదలు శాంతించారు.

ఈ సందర్భంగా సిపిఎం నాయకులు డి.విజయభాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, కె.కరుణాకరరావు, జి.సుబ్బారెడ్డి, ఎస్.ముత్యాలరావు మాట్లాడారు. ఉన్న చోటనే పేదలకు పట్టాలిచ్చి ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. రాజధానిలో ఇళ్లస్థలాల పేరిట ప్రభుత్వం కోర్టు వివాదాల్లో ఉన్న స్థలాలు ఇచ్చి చేతులు దులిపేసుకుందని, ప్రస్తుతం కోర్టు తీర్పు వ్యతిరేకంగా రావడంతో పేదలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడుంటున్న స్థలాలు పేదలు పని చేసే ప్రదేశానికి దగ్గరగా ఉన్నాయని, కుటుంబాలు సజావుగా సాగుతున్నాయని, ఇప్పుడున్న స్థలాలను ఎట్టి పరిస్థితుల్లో వదిలి వెళ్లబోరనే విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ఏ ప్రభుత్వ స్థలంలోనైనా 13 ఏళ్లు నివాసం ఉంటే దానిపై పూర్తి హక్కులు ఆ పేదలకు చెందుతాయని చట్టం చెబుతుందని గుర్తు చేశారు. ఇటీవల నీరుపారుదల శాఖ అధికారులు ఇచ్చిన నోటీసులు వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వానికి పేదలు ఉంటున్న స్థలాలు అవసరమైతే మరోచోట ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి ఇళ్లు కట్టించిన తరువాతనే ప్రస్తుతం ఉన్న ఇళ్లను ఖాళీ చేయించాలని, అప్పటి వరకు పేదల ఇళ్ల జోలికొస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వై.బర్నబస్, పి.గిరిజ, కె.బాబూరావు, దశరథరామిరెడ్డి, యోహాన్, యలమందాచారి, ఎన్.దుర్గారావు పాల్గొన్నారు.

పోలీస్ అధికారి వైఖరి సరికాదు : టిడిపి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఐడి చీఫ్ సంజయ్, అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ వత్తిపరమైన విధానాన్ని పక్కనపెట్టి రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తుల్లాగా హైదరాబాద్, ఢిల్లీలో విలేకరుల సమావేశాలు నిర్వహించడం సరికాదని జిల్లా టిడిపి అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వత్తిలో పాటించాల్సిన కనీస నియమ నిబంధనలకు స్వస్తి చెప్పి పత్రికా సమావేశాలు పెట్టుకుంటూ సంజయ్ ఎవరిని మెప్పిస్తున్నాడని ప్రశ్నించారు. చంద్రబాబు కేసు ఏపీకి సంబంధించిందని, అన్ని కార్యకలాపాలు ఇక్కడే నిర్వహించాలి కానీ సంజయ్, పొన్నవోలు సుధాకర్ ఢిల్లీ వెళ్లి పత్రికా సమావేశం నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చెందిన అధికారులు ప్రజలు కట్టిన పన్నుల ద్వారా జీతాలు తీసుకుంటూ క్విడ్ ప్రోకో లాగ వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. కేవలం జగన్ రెడ్డి ఒత్తిడి మేరకే ఆధారాలు లేని చంద్రబాబు కేసును సంజయ్ దర్యాప్తు చేస్తున్నాడని, ఆయనకు ప్రొఫెషనల్ ఎథిక్స్ లేవన్నారు. ప్రజాక్షేత్రంలోనే ఉన్న చంద్రబాబుని అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ అని అంటున్న మీరు ఆ స్కామ్ లో భాగస్తులైన అధికారులు ప్రస్తుతం వైసిపిలోనే ఉన్నారు. వారిని ఎందుకు విచారించట్లేదని సంజయ్ ని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం పాల్పడుతున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారు. గుంటూరు నగర పార్టీ అధ్యక్షులు డేగల ప్రభాకర్ మాట్లాడుతూ నీతి నిజాయితీకి మారుపేరైన చంద్రబాబు మీద వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గం అన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా చంద్రబాబుని ఏమి చేయలేవని ఆయన కడిగిన ముత్యంలా ప్రజాక్షేత్రంలోకి వస్తారని హెచ్చరించారు.

మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్, ఇతర నాయకులు

అభివృద్ధి పనులకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన అంచనాలు, అధికారుల ప్రతిపాదనలపై ఆయా విభాగాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తమ పరిశీలనలో గుర్తించిన ప్రజా సమస్యలను డివిజన్ల వారీగా, ప్రాధాన్యత క్రమంలో చేస్తున్నామని చెప్పారు. సిసి రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఆమోదం తెలిపామన్నారు. విలీన గ్రామాల్లోనూ సిసి డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, షేక్ మహమూద్, కె.గురవయ్య, ఎం.శ్రీవల్లి, పి.అంబేద్కర్, ఎస్.వెంకటరమణాదేవి, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, శ్రీనివాసరావు, ఎస్ఇ భాస్కర్, ఎంహెచ్ఒ భానుప్రకాష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నగరాభివృద్ధికి అంకిత భావంతో కృషి చేయాలని స్టాండింగ్ కమిటీకి నూతనంగా ఎన్నికైన షేక్ మహమూద్, సంకూరి శ్రీనివాసరావు, శ్యామల వెంకట రమణాదేవి, కాంద్రుకుంట గురవయ్య, మల్లెబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేద్కర్‌ను మేయర్ సత్కరించారు.

మద్యానికి డబ్బులివ్వలేదని హత్య

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మహిళను హత్య చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకలూరిపేట సుభానినగర్‌కు చెందిన షేక్ ఆరీఫా (31) కుటుంబ కలహాలతో ఒంటరిగా జీవిస్తుంది. ఈక్రమంలో గుంటూరుకు చెందిన షేక్ నశీర్‌లో సహజీవనం చేస్తుంది. ఈ క్రమంలో నశీర్ ఆమెను డబ్బులు కోసం వేధిస్తుండే వాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆమెతో గొడవపడి, దూషిస్తూ ఆమెను గొంతు నులిమి చంపేశాడని పట్టణ పోలీసులు తెలిపారు. మృతురాలికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి షేక్ పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

తాళాలు పగులగొట్టి దేవాలయంలో చోరీ

ప్రజాశక్తి - రొంపిచర్ల :మండల కేంద్రమైన రొంపిచర్లలో గల శ్రీ బాల త్రిపుర సుందరి సమేత శ్రీ శంకర స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. గుడికి వెళ్ళిన వారు గుడి తాళాలు పగులగొట్టటం చూసి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం తెలియజేశారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, గ్రామస్తులు అక్కడకు చేరుకున్నారు. ఆలయంలో చోరీకి వచ్చిన దొంగలు గుడి తాళాలు పగులగొట్టి విలువైన వస్తువులు అపహరణకు ప్రయత్నించారు. అయితే గుడిలో

విలువైన వస్తువులు దొరకకపోవటంతో వారు వెనుదిరిగి వెళ్ళిపోయి ఉండవచ్చునని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గుడిలో సిసి కెమెరా పుటేజ్ ని పరిశీలించగా అది పని చేయలేదు. చోరీకీ వచ్చిన దొంగలు పక్కా ప్లాన్ ప్రకారం సిసి కెమెరా హార్డ్ వేర్ తీసివేసి దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు దేవాదాయశాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సిహెచ్ సురేష్ బాబు తెలిపారు. ఈ సంఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

శ్రావణి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్) శ్రావణి ఫైల్ ఫొటో

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బేతపూడి గ్రామస్తురాలు దారా శ్రావణి పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. శ్రావణి మృతికి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతురాలు శ్రావణికి భర్త చిన్న నరసయ్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రావణి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా తాపీ ధర్మారావు జయంతి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ సాహితీవేత్త తాపీ ధర్మారావు 136వ జయంతిని పురస్కరించుకుని తెలుగు మాధ్యమాల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సంస్థ కార్యాలయంలో వ్యవస్థాపకులు తన్నీరు శివశంకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న

హెచ్ సి వి రిపోర్టర్ సుధాకర్‌ను సత్కరిస్తున్న బృందం

ప్రముఖ న్యాయవాది పొన్నం విజయకుమార్ మాట్లాడుతూ తాపీ ధర్మారావు మూఢ నమ్మకాలను ఎదిరించి అద్భుతమైన రచనలతో భావి సమాజానికి వేగుచుక్కగా నిలిచారని, వాడుక భాషకు జీవాన్ని నింపిన గొప్ప భాషాభిమాని అని కొనియాడారు. అనంతరం హెచ్ సి వి ఛానెల్ సీనియర్ న్యూస్ ఇన్చార్జి చొప్పర సుధాకర్ ను ఘనంగా సత్కరించి, తాపీ ధర్మారావు స్మారక పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ఈఎల్వి అప్పారావు, అయినాల మల్లేశ్వరరావు, పి.టి.అవధాని, ఎల్. లక్ష్మణరావు, వి. భీమేశ్వర ప్రసాద్, ఆళ్ళ నాగేశ్వరరావు, ఎం. నాగరాజు, పి రవికుమార్, అడపా సంపత్ రాయుడు పాల్గొన్నారు.

పొన్నూరు దేవస్థానంలో షాపులకు నేడు వేలం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరులోని సహస్ర లింగేశ్వ స్వామి దేవస్థానంకు సంబంధించిన షాపులు రెండు, మరియు షెడ్డు లీజుకు బుధవారం వేలం నిర్వహిస్తున్నామని ఇఓ టి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10గంటలకు దేవస్థానం ఆవరణలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో టెండరు, బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. పాల్గొనదలచిన వారు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా ఇఓ ప్రకటనలో తెలిపారు.

ఆస్తి వివాదంలో దాయాదుల మధ్య ఘర్షణ

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

ఆస్తివాదంలో వెల్దుర్తి మండలం పట్లవీడు గ్రామంలో మంగళవారం జరిగిన ఘర్షణలో ఉప్పల్పాటి గంగాధర్ రావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు కు గాయాలయ్యాయి. వారి ఇరువురిని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గంగాధర్ రావు వెంకటేశ్వరరావులకు వారి దాయాదులకు మధ్య గత కొంతకాలంగా పొలం తగాదా నడుస్తుంది. ఆ వివాదంలోనే మంగళవారం గొడవపడ్డారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల : వెల్దుర్తి మండలం మండాది వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి ఉప్పలపాడు గ్రామం నుండి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇరువురు యువకులకుమండాది వద్ద మేక అడ్డు రావడంతో బండి అదుపు తప్పి పడిపోయింది. బండిమీద ఉన్న అన్నపురెడ్డి రమణారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మరొక యువకుడికి స్వల్ప గాయాల య్యాయి. రమణారెడ్డిని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.

టిప్పర్ బోల్తా - స్వల్పగాయాలు

ప్రజాశక్తి - రెంటచింతల : సోమవారం వేకువ జామున వేర్వేరు ప్రాంతాల్లో మంచికల్లు నుంచి గ్రావెల్ లోడ్లో వున్న టిప్పర్, మదనపల్లి వచ్చే ఖాళీ లారీ బోల్తాపడ్డాయి. లారీ డ్రైవర్ అల్లూరి సాయి కుమార్ గాయపడగా టిప్పర్ డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. కానీ సాగవుతున్న వరిలో వాహనాలు పడడంతో రైతుకు నష్టం చేకూరింది.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, మంగళగిరి

E.P No.10/2023 in O.S.No.32/2021

Between:-

కళ్ళం భాస్కర రెడ్డి ...డి. హెచ్.ఆర్

మరియు

కడియం శ్రీనివాసరావు ...జె.డి.ఆర్.

టు:(జె.డి.ఆర్)

కడియం శ్రీనివాసరావు, S/o కాటం రాజు, నివాసం: డోరు నెం:7-14, పెనుమాక గ్రామం, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు ఎగ్జిక్యూషన్ పిటీషన్ (E.P)లో జె.డి.ఆర్ అయిన నీకు శ్రీ కోర్టు వారు సి.పి.సి అండర్ ఆర్డరు 21, రూల్-54(1) (A) నోటీసును జారీ చేయు నిమిత్తం ఈ పేపర్ ప్రకటన ద్వారా ది.11-10-2023 వ తేదీకి వాయిదా వేసి యున్నారు. కావున సదరు జె.డి.ఆర్. అయిన నీవు పై తెలియ పరచిన తేదీన పైన సూచించిన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం 10-30 ని.లకు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేని యెడల మీ పరోక్షము నందు తీర్మానించేదరని ఇందు మూలముగా తెలియ చేయడమైనది.

వాయిదా తేది:11-10-2023

(శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారము)

ఇట్లు
దొడ్డక బ్రహ్మయ్య,
న్యాయవాది, మంగళగిరి.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో, గురజాల

ఓ.యస్.నెం. 138/2021

గంగినేని మణికంఠ ....వాది

మరియు

కడియం గామయ్య ... ప్రతివాది

పై నెంబరు దావాను వాది నీపై నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసిఉన్నాడు. సదరు దావాయందు పై కోర్టువారు నీకు అనేక పర్యాయములు సమన్లు పంపించినను నీవు దావా సంగతి ఎరుక వుండి కూడా ఉద్దేశ్యపూర్వకంగా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, పై కోర్టువారు ఈ పత్రిక ప్రకటన ద్వారా దావా పెండింగ్ సంగతి నీకు తెలియపరచమని ఆదేశించియున్నారు. కావున తెలియ పరచడమైనది. నీ హాజరు నిమిత్తం సదరు వ్యాజ్యం ది. 22-9-2023వ తేదీన వాయిదా అయివున్నది. ఆ రోజు నీవు స్వయంగా పై కోర్టువారి ఎదుట హాజరయి నీకు గల ఆక్షేపణలను తెలుపగలరు. లేనియెడల ఆ రోజున నీ పరోక్షమందు విచారించి దావాను తీర్మానించెదరని నీకు ఇందుమూలంగా తెలియజేయడ మైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది: 22-9-2023

కనకం ఆదినారాయణ,
వాది తరపు న్యాయవాది, గురజాల
ఫోన్ : 9885135746

In the court of the Hon'ble XII Addl.Dist. Judge: Guntur
I.A.No: 693/2022 & I.A.No:694/2022 & I.A.No: 695/2022 In I.A.No: 1230/2018 in O.S.No: 315/2012

Between:

Athipatla Kishore ...Petitioner/Plaintiff

And

Athipatla Krishna and Others ....Respondents/Defendants

To.

R-3: Cherukuri Narendra, S/o.Sankara Rao, R/o.Pedakurapadu (Vil&Md), Guntur Dist.

R-4: Nettem Hanumaiah, S/o.Pitchaiah, R/o.Amaravathi(Vil &Md), Guntur Dist.

పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం: 693/2022, ఐ.ఎ.నెం: 694/2022 & ఐ.ఎ.నెం: 695/2022 పిటీషనులలో 3 & 4 వ రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది: 31-10-2023 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని,మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:31-10-2023

సానికొమ్ము సుబ్బారెడ్డి,
పిటీషనరు/వాది తరపు న్యాయవాది,
గుంటూరు.

IN THE COURT OF HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE, NARASARAOPET,
IP.No. 13 of 2022

Between

Gogula Srinivasarao - Petitioner

Vs

1. Bhemanadhuni Yedukondalu
2. Tollamadugu Jayarao
3. Aala Nagamma
4. Gumma Padma
5. Gumma Koteswaramma
6. Kommanuboyina Gangamma
7. Peela Srinivasa Rao @Srinu
- Respondents

పై నెంబరు **IP** దావాలో పిటీషనర్ ఇందలి రెస్పాండెంట్స్ 1 నుండి 7 పై **IP** దాఖలు చేసి సదరు పిటీషనర్‌ను **Insolvency** గా డిక్లేర్ చేయవలసినదిగా కోరియున్నాడు. సదరు **IP** లో చూపబడిన రెస్పాండెంట్ నెం.5 కి ఎన్నిసార్లు బత్త కట్టినను ఉండి కూడా తీసుకొని యుండలేదు. ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనుటలేదు. అందువలన శ్రీ కోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీసు క్రింద ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా పబ్లికేషన్ ఇవ్వమని శ్రీ కోర్టు వారు ఆర్డరు ఇచ్చియున్నారు. శ్రీ కోర్టువారి ఆర్డర్ ప్రకారం ఈ పబ్లికేషన్ ఇవ్వటం జరిగినది. ఇందులోని పై 5వ రెస్పాండెంట్ వారికి ఏమైన ఆక్షేపణలు ఉన్నచో మీరు కాని, మీ తరపు లాయరు గారు కాని హాజరై ది.22-09-2023న మీ ఆక్షేపణలు ఉదయం 10.30 ని॥లకు తెలుపగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో...

వాయిదా తేది : 22-09-2023

ఉదయం గం.10.30 ని.లకు
సింధుకూరి శ్రీనివాసరావు
షేక్ అఫిజున్నీసా, యం.శ్రీనివాసరావు
కె. రామనారాయణ,
పిటీషనర్ తరపు అడ్వకేట్స్, నరసరావుపేట

In the court of the Hon'ble II Addl.Senior Civil Judge: Guntur
I.A.No:133/2023 in O.S .No: 623/2016

Between:

Jinni Padma Kumari & Others ....Petitioners/Plaintiffs

And

Jinni Siva Sankara Rao(Died) and Others ....Respondents/Defendants

To.

R-12/D-12: Jinni Pushpa, W/o.late Siva Samba Siva Rao,

R-13/D-13: Jinni Ramu, S/o.late Siva Samba Siva Rao,

R-14/D-14: Jinni Mani Sri, D/o.late Siva Samba Siva Rao,

R-13& R-14 are being miniors rep.by their mother R-12, All are R/o.1 st lane, Rajiv Gandhi Nagar, RTC Colony, Guntur.

పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం: 133/2023 ను దావాలో 7వ ప్రతివాది మరణించినందున అతని స్థానే వారసులుగా ఆర్-12 నుండి 14 లను చేర్చమని దాఖలు చేసిన పిటీషనులో 12 నుండి 14 వ రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఆర్డరు వేస్తూ ది:29-09-2023కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని,మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:29-09-2023

చాగంటి నరసింహారెడ్డి,
పసుపులేటి శ్రీనివాస రావు,
పిటీషనరు/వాది తరపు న్యాయవాదులు, గుంటూరు.

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా, తెనాలి రూరల్ మండలం, బుర్రిపాలెం గ్రామం, డోరు నెం:5-154, నివాసి అయిన (లేటు) వేంపాటి సాంబశివరావు గారి కుమారుడు వేంపాటి శ్రీనివాసరావు గారి ద్వారా సంజాయిషి పొందిన పిమ్మట యావన్మందికి తెలియచేయునది ఏమనగా నా క్లయింటు అయిన వేంపాటి శ్రీనివాసరావు గారికి వారి తల్లిగారు అయిన గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, కాజ గ్రామం, డోరు నెం:5-66 నివాసి (లేటు) వేంపాటి సాంబశివరావు గారి భార్య వేంపాటి ద్రౌపతి ది.24-09-2022వ తేదీన S.R.O. పెదకాకాని నందు ఒక వీలునామా రిజిష్టరు కాబడినది. సదరు వీలునామా రిజిష్టరు నెం: BK-III దస్తావేజు నెం.81/2022 రుగా రిజిష్టరు కాబడినది. అయితే ఇటీవల నా క్లయింటు యొక్క తల్లి ది.24-09-2022 న చనిపోయినందున వీలునామా ప్రకారము నా క్లయింటుకు సంక్రమించి, తదాది నుండి నేటి వరకు సదరు స్థిరాస్తి నా క్లయింటు సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో నిర్వివాదముగా అనుభవించు చున్నాడు. సదరు సంక్రమించిన షెడ్యూలులో ఐటం నెం:2రుగా చూపబడిన భూమిని వెబ్ లాండ్ అడంగల్ నందు మరియు రెవిన్యూ రికార్డులో నాక్లయింటు పేరు నమోదు చేసుకొనుటకు గాను శ్రీ మంగళగిరి తహాశీల్దారు వారికి అర్జీ దాఖలు చేసి యున్నారు.

షెడ్యూలు:- నా క్లయింటు అయిన వేంపాటి శ్రీనివాసరావు స్వాధీన పరచుకొని, సమస్త హక్కులతో అనుభవించుచున్న వీలునామాలో పేర్కొనబడిన 2వ అయిటం: గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, కాజ గ్రామం డి.నెం:16/2 లో య.0-26 సెంట్లు భూమికి హద్దులు:- తూర్పు: మాణిక్యాల బ్రహ్మయ్య గారి భూమి హద్దు, దక్షిణం: బొమ్ము శివారెడ్డి గారి భూమి హద్దు, పడమర: బ్రాంచి కాలువ గట్టు హద్దు, ఉత్తరం: సిరిబోయిన అంజమ్మ గారి భూమి హద్దు, ఈ హద్దుల మధ్య య.0-26 సెంట్లు లేక హె.0.104ర్లు శేరీ మాగాణి భూమి మాత్రమే. ఈ ఆస్తి గురించి ఎవ్వరికైనా ఏవిధమైన క్లయిములు గాని, అభ్యంతరములు వగైరాలు గాని వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోగా నాకు గాని, శ్రీ మంగళగిరి తహశీల్దారు గారికి గాని లిఖిత పూర్వకముగా తెలియ చేయవలసినదిగా కోరడమైనది. గడువు లోపున ఎటువంటి అభ్యంతరములు రాని యెడల షెడ్యూలు ఆస్తి నిష్పేచిత ఆస్తిగా భావించి వేంపాటి శ్రీనివాసరావు అను నా క్లయింటు యొక్క పేరును నమోదు చేయబడునని ఇందు మూలముగా తెలియ చేయడమైనది.

తేది:17-09-2023

ఇట్లు
దొడ్డక బ్రహ్మయ్య,
న్యాయవాది, మంగళగిరి.

సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రరావు

శాశ్వతంగా వలసెళ్లిన వారి ఓట్లు తొలగిస్తాం

ప్రజాశక్తి - పెదకూరపాడు

మరణించిన వారి ఓట్లను తొలగించాలని పెదకూరపాడు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి రామచంద్రరావు అన్నారు. మంగళవారం అన్ని రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే, దొంగ ఓట్లపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తాత్కాలికంగా ఉపాధి కోసం వలస వెళ్లిన వారి ఓట్లు ఎలా తొలగిస్తారని పలు పార్టీల ప్రతినిధులు ప్రశ్నించగా శాశ్వతంగా వెళ్లిన వారి ఓట్లు మాత్రం తొలగిస్తామని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల తహశీల్దార్లు, సిబ్బంది, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం, పిఇటి, ఉపాధ్యాయులు

క్రీడల్లో నకరికల్లు జెడ్పి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నకరికల్లు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 17వ తేదీ వరకు నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆటల పోటీల్లో చేజర్ల విద్యార్థులు ప్రతిభ కనబరిచి నియోజవర్గ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ పాహిం మంగళవారం తెలిపారు. విద్యార్థులకు ఆటల పోటీల వల్ల శారీరకంగా మానసికంగా ఉల్లాసం కలుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. భవిష్యత్‌లోనూ మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.లలిత, పటాన్ మల్లిక, సిహెచ్.వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, మోహన్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు గౌస్ పాల్గొన్నారు.

నేడు, రేపు మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఈపూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఈపూరులోని జెడ్‌పి పాఠశాలలో బుధ, గురువారాల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని హెచ్‌ఎం ఎన్.రామకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, త్రో బాల్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్, యోగలో పోటీలు ఉంటాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో-ఆర్డినేటర్, పీడీ ఎ.వీరాంజనేయులు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

కృత్రిమ పాదల ఇచ్చేందుకు రేపు ఎంపికలు

ప్రజాశక్తి-మాచర్ల

కృత్రిమ పాదాలు అవసరమైన వారికి ఉచితంగా ఇచ్చేందుకు ఎంపిక శిబిరాన్ని వాసవి క్లబ్, లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో గురువారం నిర్వహిస్తామని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. పట్టణంలోని బిఎస్ఆర్ పంక్షన్ హాల్‌లో ఎంపిక ప్రక్రియ ఉంటుందని, అవసరమైన వారు 9849065882, 6301556564 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

దళితులపై పెరిగిన దాడులు

- అట్రాసిటీ చట్టాన్ని నీరుగారుస్తూ నిందితులకు బెయిల్
- ఎస్సీలకు ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలి
- 29న విజయవాడలో మహాధర్నా జయప్రదానికి పిలుపు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మోడీ హయాంలో దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి అన్నారు. దళితుల సామాజిక న్యాయం కోసం విజయవాడలో 29న నిర్వహించే మహాధర్నా జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలను వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. శివనాగరాణి మాట్లాడుతూ మనువాద బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టాక దేశవ్యాప్తంగా దళితుల మీద దాడులు, హత్యలు, అత్యాచారాలు తీవ్రంగా పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. మణిపూర్ ఘటనలు దీనికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొందని, దళిత యువకుణ్ణి ఎమ్మెల్సీ అనంతబాబు హత్యచేసి ఇంటికి పార్శిల్ చేశారని గుర్తు చేశారు. అయితే దళిత, గిరిజనులకు రక్షణగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చేలా, నిందితులకు 41 సిఆర్‌పిసి ప్రకారం స్టేషన్ బెయిల్ ఇవ్వడం వల్ల కుల దురంహకారులకు అదుపు లేకుండా పోతుందని అన్నారు. స్టేషన్ బెయిల్ ఇవటాన్ని వెంటనే ఆపాలని, కులవివక్ష, అంటరానితనం నిర్మూలనకు ప్రభుత్వం ప్రచారం చేసి టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులకు, చర్మకారులకు ఇస్తున్న పింఛనును రూ.5 వేలకు పెంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు గృహ అవసరాలకు ఉపయోగిస్తున్న ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని, పాత బకాయిలు రద్దు చేయాలని కోరారు. ఈ అంశాలపై చేసే ధర్నాలో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, సహాయ కార్యదర్శి ఎం.విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, నాయకులు జె.రాజ్ కుమార్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కారం కోసం 'మనకోసం శంకరన్న

మండెపూడి, నరుకుళ్లపాడులో ఎమ్మెల్యే గ్రామసభలు

ప్రజాశక్తి - అమరావతి

గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ప్రజా సమస్యలు పూర్తిగా పరిష్కరించాలనే లక్ష్యంతో 'మన కోసం శంకరన్న' పేరుతో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అమరావతి మండలం మండెపూడి, నరకుళ్లపాడులో మంగళవారం 'మన కోసం శంకరన్న' గ్రామ సభలు నిర్వహించి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన సమస్యలను ఎంత వరకు పరిష్కరించారని అధికారులతో సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందడం లేదనే ఫిర్యాదులు పరిష్కారం అయ్యాయని, తన దృష్టికి వచ్చిన సమస్యల్లో దాదాపు 90 శాతానికి పైగా ఇప్పటికే పరిష్కరించామని అన్నారు. మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తామన్నారు. మండెపూడి ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక దగ్గర కల్వర్టు నిర్మిస్తామని, శివాలయం దగ్గర ఉపాధి హామీ నిధుల ద్వారా పైపులైను వేస్తామని చెప్పారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్ సమస్యను అక్టోబర్ 15లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండెపూడి నుంచి పరస వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.1.5 కోట్లు మంజూరయ్యాయని, టెండరు ప్రక్రియా ముగిసిందని, నిర్మాణం త్వరలోనే ప్రారంభం అవుతుందని వివరించారు.

సోమవారం మాచర్లలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : మాచర్ల పట్టణంలో వచ్చే సోమవారం జగనన్నకు చెపుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహిస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని దుర్గి, కారంపూడి, రెంటచింతల, మాచర్ల, వెల్దుర్తి మండలాల ప్రజలు 25న ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఫిర్యాదులు ఇవ్వాలని సూచించారు.

టైలర్ మొలకయ్య మృతి

ప్రజాశక్తి - రెంటచింతల : ప్రముఖ దర్జీ, 52 ఏళ్లపాటు ఆ వృత్తిలో కొనసాగడంతోపాటు వందలాది మందికి టైలరింగ్ నేర్పించిన నారాయణపురం పెద్ద మొలకయ్య (73) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. భౌతికకాయాన్ని ఎంపిపి డి.చౌడేశ్వరి, సర్పంచ్ పూజలు పుష్పవతి రామయ్య సందర్శించి నివాళుర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎం.ఉమ, బి.తిరుపతిరావు, సైదయ్య, ప్రమీల, శౌరెడ్డి, మాజీ సర్పంచ్ ఎ.ప్రతాపరెడ్డి, పి.భారతి, ఎన్.నాగేశ్వరరావు, టైలర్లు ఉన్నారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- తల్లులు బలంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన పిల్లలు
- పోషణ మాసోత్సవాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే
- ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం

గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 30వ తేదీ వరకూ కొనసాగే పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాలులో సామూహిక సీమంతాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని, అందులో భాగంగా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఈ నెల 30వ తేది నుండి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. గర్భిణులకు అవసరమైన పోషకాహారాన్ని టేక్ హోం రేషన్ ద్వారా బెల్లం, ఖర్జూరం, పాలు వంటి వాటిని అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రక్తహీనత ప్రతి వంద మందిలో 32 మందికి ఉందని, తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే పిల్లలు శారీరకంగా, మానసింగా బలంగా ఉంటారని అన్నారు. ప్రతినెలా 9వ తేదిన ప్రభుత్వాస్పత్రుల్లో నిర్వహించే వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గర్భిణులు శారీరకంగా బలంగా, మానసికంగా సంతోషంగా ఉన్నపుడే ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిస్తారన్నారు. చిన్నచిన్న సమస్యలకు కుంగిపోవద్దని అన్నారు. గర్భం దాల్చిన నాటి నుండి ఒకే డాక్టరు వద్ద వైద్యం చేయించుకోవాలని సూచించారు. డాక్టర్‌ను మార్చుకోవాల్సి వస్తే ముందుగానే సంప్రదించి వివరాలన్నీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అందిస్తున్న జగన్న సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ఒక్కో కిట్‌పై రూ.650/- ఖర్చు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి, ఐసిడిఎస్ అధికారి బి.అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గడిగుంటపాలెం సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడికొండ సమావేశంలో మాట్లాడుతున్న కంచుమాటి అజయ్ కుమార్

25న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి-తెనాలి

కార్పోరేట్లకు లక్షల కోట్లు రుణమాఫీ చేస్తున్న ప్రభుత్వం రైతు ల రుణమాఫీ చేయకపోవటం దుర్మార్గమని ఏపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అన్నారు. రూరల్ గ్రామం జగ్గడిగుంటపాలెంలో మంగళవారం రైతు సంఘం మండల కమిటీ సమావేశం ముద్దన సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో శివశంకరరావు మాట్లాడుతూ రైతులకు సంబంధించి రుణ మాఫీని వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలోకి తేవాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించడమంటే ఉచిత విద్యుత్‌కు మంగళం పాడటమేనన్నారు. వ్యవసాయానికి 9 గంటల నిరంతరాయంగా విద్యుత్ సరఫరానిచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సమస్యలపై ఈనెల 25లోగా రైతు భరోసా కేంద్రాల్లో వినతిపత్రాలు సమర్పించాలని, అలాగే ఈ25న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించాలని కోరారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్‌లో భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.10వేలు పరిహారం చెల్లించాలని, అలాగే 90 శాతం సబ్సిడితో రభీకి విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవణలో జరిగే జిల్లా శిక్షణా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో టి.వెంకటేశ్వర్లు, బి.సాంబశివరావు, టి.మాధవరావు, డి.పుల్లయ్య, ఎన్.నాగయ్య, జి.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, ఎ.గోపి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ: రైతుల సమస్యలపె ఆర్‌బికెల్లో వినతి పత్రాలు మరియు ఈనెల 25న జరుగు మండల ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ కోరారు. తాడికొండ సాయిబాబా గుడి వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు సకాలంలో పడకపోవడంతో నాగార్జునసాగర్ నీరు విడుదల చేయకపోవడంతో జిల్లాల సాగు విస్తీర్ణం తగ్గిందని, దాదాపు 40 వేల ఎకరాల్లో నీరు లేక ఏ పంట వేయాలి అర్థం కాక రైతులు అయోమయ పరిస్థితిలో ఉందన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు ఏ పంటలు వేయాలో చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. ఈ సందర్భంగా కొన్ని డిమాండ్లను చేశారు. రైతు, కౌలు రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని, భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, సబ్సిడీ అందించాలన్నారు. గుంటూరు రూరల్ గ్రామమైన జొన్నలగడ్డలో ముంపు గురవుతున్న పంటలను కాపాడా లని తదితర సమస్యలపై ఆర్‌బికెల్లో వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కనగాల పూర్ణచంద్రరావు, మండల నాయకులు చింతల భాస్కరరావు, బాణావత్ భద్రయ్య, ఇమ్మడి రామారావు, ఎర్ర నరసింహారావు, రాయపూడి నాగేశ్వరావు, జి. నరేష్, కరణంసుబ్బారావు గోగినేని పుల్లారావు, యంపరాల లక్ష్మీనారాయణ, కందుల రామారావు, పులి డేవిడ్, గొల్ల తాతి రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌బికెలో రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - తాడేపల్లి : ప్రకృతి వైపరిత్యాలతో నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ ఇవ్వాలని, రూ.2లక్షలలోపు రుణమాఫీ చేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉండవల్లి, పెనుమాక ఆర్‌బికెల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం గ్రామ ఉపాధ్యక్షులు పి వీరాస్వామి, నాయకులు కోనపురెడ్డి రమేష్, షేక్ ఎర్రపీరు పాల్గొన్నారు.

కాజలో శాసనాల పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం కాజా గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి, ఆంజనేయస్వామి, అగస్తేశ్వర స్వామి ఆలయాలలో శాసనాలను పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి మంగళవారం పరిశీలిం చారు. ఆయా ఆలయాలలో ఉన్న దశాబ్దాల కాలం నాటి శాసనాలను పరిశీలించారు. కాకతీయుల కాలం నాటి ఈ శాసనాలపై ఉన్న అక్షరాలను ఆయన అధ్యయనం చేశారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి చరిత్రలు పుస్తక రూపంలో ప్రజలకు తెలియజెప్పాలి అనే సంకల్పంతో పరిశీలిం చడం జరిగిందని శివ నాగిరెడ్డి తెలిపారు. అదే విధంగా గ్రామంలోని గ్రామ దేవతల ఆలయాలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో సింహాద్రి వెంకట రామారెడ్డి, కే కోటేశ్వరరావు, బొమ్ము పిచ్చిరెడ్డి ,సింహాద్రి శ్రీనివాసరెడ్డి , అర్చకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఐ దేహధారుడ్య పరీక్షలు

ప్రజాశక్తి -గుంటూరు సిటీ

గుంటూరు రేంజ్ పరిధి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు గుంటూరు పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో దేహధారుడ్య పరీక్షలు మంగళవారం కొనసాగాయి. గుంటూరు రేంజ్ ఐ.జి పాల్ రాజు, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ సుప్రజా పర్యవేక్షించారు. 691 మంది అభ్యర్థులకు గాను 426 మంది అర్హత సాధించినట్లు ఐ.జి తెలిపారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టుల అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులతో పాటు 1600,100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసరావు, చంద్రశేఖర్ రావు ఆర్ఐ రాజారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లును స్వాగతిస్తున్నాం : లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు సిటి

సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న చట్టసభలలో మహిళా రిజర్వేషన్ బిల్లును నారీశక్తి వందన్ పేరుతో ఈనెల 19వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చొరవతో లోక్సభలో లో ప్రవేశపెట్టడాన్ని జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మారెడ్డి స్వాగతించారు. రాజ్యసభలో 2010లో మహిళా బిల్లు ఆమోదం పొందిన, లోక్ సభలో 13 సంవత్సరాల తర్వాత లోక్ సభ, రాజ్యసభల అమోదలతో వేలాదిమంది మహిళలు పార్లమెంటులో, శాసనసభలలో ప్రాతినిధ్యం పొందుతారన్నారు. రౌండా, క్యూబా, నికరాగువా, మెక్సికో, న్యూజిలాండ్ దేశాల చట్టసభలలో మహిళలు 50 శాతానికి మించి ఉన్నారని మనదేశంలో 15% లోపుగా ఉండడం శోచనీయం అన్నారు. 2029 నుండి దేశవ్యాప్తంగా చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యం 33 శాతం అమలుకానుందని, హర్షం వ్యక్తం చేశారు. 73, 74వ రాజ్యంగ సవరణ ద్వారా స్థానిక ప్రభుత్వాలలో 33 శాతం మహిళ రిజర్వేషన్ వలన 7 లక్షల మంది మహిళలు నాయకత్వ స్థానాలలోకి వచ్చారని తత్ఫలితంగా మహిళాసాధికారికత సాధ్యమౌతుందని తెలిపారు. 128వ రాజ్యాంగ సవరణ ద్వారా మహిళా బిల్లు అమలులోకి వస్తే ప్రస్తుతం లోక్సభ లో ఉన్న 82 మంది మహిళలు 181 మందికి చేరుతారని వివరించారు. అన్ని రాజకీయ పార్టీలు సమైక్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్సభ, రాజ్యసభలో ఆమోదిస్తారని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. గత రెండు దశాబ్దాలుగా ఉన్న మహిళల స్వప్నం సాకారం అవుతుందని పేర్కొన్నారు.

కవి ఆళ్లకు డాక్టర్ బోయి భీమన్న పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి : ప్రముఖ అభ్యుదయ కవి, రచయిత డాక్టర్ బోయి భీమన్న జయంతి సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవులను గుర్తించి జూమ్ వేదికగా ప్రదానం చేసిన జాతీయ డాక్టర బోయి భీమన్న లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు 2023ను పట్టణానికి చెందిన చెందిన కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు అందుకున్నారు. వృత్తిపరంగా గుంటూరు2 డిపోలో ఆర్టీసీ కండక్టర్ గా పనిచేస్తూ సాహితీ రంగానికి నాగేశ్వరరావు చేస్తున్న కృషికి గుర్తింపుగా పురస్కారాన్ని అందించామని మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కె చక్రవర్తి చెప్పినట్లు నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆళ్ల నాగేశ్వరరావును స్థానిక సాహితీవేత్తలు అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న భుజంగరావు

నిర్మాణ కార్మికుల నిధులను వారికే ఉపయోగించాలి : సిఐటియు

ప్రజాశక్తి-తాడేపల్లి

భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికులకే ఖర్చు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం తాడేపల్లి పట్టణ అధ్యక్షులు సిహెచ్.భుజంగరావు డిమాండ్ చేశారు. సుందరయ్యనగర్‌లోని సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల పట్టణ కమిటీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లించడం సరికాదన్నారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని మండిపడ్డారు. మూడు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికులకు పని ప్రదేశంలో అన్యాయం జరిగితే అడిగే హక్కును కూడా లాగేసుకున్నారన్నారు. సిఐటియు అగ్ర నాయకులు పరసా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలను ఈ ప్రాంతంలో జరుపుకుంటున్నామని తెలియజేశారు. కార్మిక వర్గ హక్కుల సాధన కోసం సత్యనారాయణ తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. కనీస వేతనాలు అమలు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న అసంఘటిత రంగ కార్మికుల క్లైయిలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిధుల కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం తాడేపల్లి పట్టణ కార్యదర్శి కె.బాబూరావు, చంద్రశేఖర్, సాయికుమార్, ఖాజావలి, సిఐటియు నాయకులు కె.కరుణాకరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యను పరిష్కరించండి..

ప్రజాశక్తి - తాడేపల్లిరూరల్

ప్రాతూరులో అస్థవ్యస్థంగా ఉన్న డ్రైనేజీతో వ్యవస్థలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకుంటున్నారు. ఎం టీఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో కొన్నిచోట్ల డ్రైనేజీలు ఉన్నా మురుగు నీరుపారుదల లేక ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. మరోవైపున మంచినీటి ట్యాప్‌లు కూడా పక్కనే ఉండడంతో అవి తాగిన స్థానిక ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. తక్షణమే సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి, ప్రాతూరు గ్రామంలో మురుగునీటి సమస్యను పరిష్కరిస్తే, దోమల బెడద తగ్గి, ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ఉంటారని పలువురు స్థానికులు కోరుతున్నారు.

పురస్కారాన్ని అందుకుంటున్న రమాదేవి

డాక్టర్ సరికొండ రమాదేవికి పురస్కారాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లికి చెందిన డాక్టర్ సరికొండ రమాదేవికి తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం-2023 పురస్కారం, తెలుగు వెలుగు లెజండరీ జాతీయ గౌరవ పురస్కారం లభించాయి. తెలుగు వెలుగు సాహితి వేదిక 'గ్రేటర్ వరంగల్' ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో తెలుగు భాషా దినోత్సవం పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ ఆదెయ్య మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

నకరికల్లు విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న వై.సి హెచ్. ఆదెయ్య (59) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. భౌతికకాయాన్ని ఎడిఇ బి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎఇ సురేష్, సిబ్బంది సందర్శించి నివాళు లర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పౌరాణిక రంగస్థల కళాకారులు బలరామరాజుకు మహానంది పురస్కారం

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన పౌరాణిక రంగస్థల కళాకారులు చక్రవరం బలరామరాజు తెలుగు వెలుగు సాహితీ వేదిక వారి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో మహానంది పురస్కారం అందుకున్నారు. నంది పురస్కారం పొందిన రంగస్థల కళాకారులు చక్రవరం బలరామరాజును మంగళవారం గ్రామస్తులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కళాకారులు బలరామరాజు మాట్లాడుతూ గత (46) సంవత్సరాల నుండి రంగస్థల కళాకారుడిగా కొనసాగుతున్నానని అన్నారు. కళారంగానికి తాను చేస్తున్న సేవలను గుర్తించి తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు ఈ నెల 17న

హైదరాబాదులో పురస్కారాన్ని ప్రదానం చేశారని చెప్పారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక చైర్మన్ పి.రాజ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు టి.పూర్ణచంద్రాచార్యులు నుండి అవార్డు అందుకున్నానని అన్నారు. తాను పౌరాణిక, సాంఘీక నాటకాలల్లో నటించానని, ఇప్పటి వరకూ 287 సమాజాలకు బ్రహ్మంగారి, సత్యహరిశ్చంద్ర నాటకాలకు దర్శకత్వం, సంగీతం వహించి ప్రదర్శనలు చేశారని తెలిపారు. పౌరాణిక ఏకపాత్రలు, కరతాళమైన పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు పొందానన్నారు. అన్ని నాటిక, భజన, ఏకపాత్ర పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించానని, గతంలో జాతీయ పౌరాణిక, విశిష్ట కళారత్న పురస్కారం పొందానని తెలిపారు. ఇటీవల పెదనందిపాడులో జరిగిన ఎన్.టి.ఆర్ శతజయంతి వేడుకలల్లో భాగంగా నిర్వహించిన పౌరాణిక పద్య ఏక పాత్ర పోటీల్లో పాల్గొని బహుమతి అందుకున్నానని చెప్పారు.

అరుగుపై కూర్చున్నందుకు దూషణ, దాడి

- బాధితునికి కెవిపిఎస్ పరామర్శ
- పెత్తందారుపై అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - బెల్లంకొండ

బాధితునితో మాట్లాడుతున్న నాయకులు

మండలంలోని మాచయ పాలెంలో దళితుడైన సోమబత్తిని సుందరావును కులం పేరుతో దూషించి దాడి చేసిన పెత్తందారుడు కర్నాటి రమేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వెంటనే కేసు నమోదుతోపాటు అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. రెండ్రోజుల కిందట మాచయపాలెంలో జరిగిన ఘటనలో బాధితుణ్ణి రవిబాబు మంగళవారం పరామర్శించారు. సెంటర్లో కూర్చొని వేరే వ్యక్తితో మాట్లాడుతున్న సుందర్రావును.. నువ్వు మాలోడివి.. కులం తక్కువ వాడివి.. నువ్వు మా ప్రక్కన అరుగు మీద కూర్చుంటావా... అంటూ రమేష్ బూతులు తిట్టాడని, దీన్ని ప్రశ్నించినందుకు సుందర్రావుపై దాడి చేశాడని అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడం అన్యాయమని అన్నారు. దీనిపై సత్వరమే చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని రవిబాబు హెచ్చరించారు. పరామర్శించిన వారిలో టి.హనుమంతరావు తదితరులున్నారు.

భార్య, చంటిబిడ్డను చూడ్డానికి వెళ్తూ...

- రోడ్డు ప్రమాదంలో డప్పు కళాకారుడు మృతి

ప్రజాశక్తి - నాదెండ్ల

ఘటనా స్థలిలో మృతదేహం..

మృతుడు ప్రసన్నకుమార్ (ఫైల్)

బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలంలో మంగళవారం వాటిల్లిన రోడ్డు ప్రమాదంలో డప్పు కళాకారుడు మృతి చెందాడు. వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా నాదెండ్ల మండల కేంద్రానికి చెందిన దావులూరి రావమ్మ, లక్ష్మయ్య దంపతుల రెండో కుమారుడైన ప్రసన్నకుమార్ (27)కు బాపట్ల జిల్లా అద్దంకి మండలం వెంకటాపురానికి చెందిన ఝాన్సీతో మూడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కుమారుడు, మూడు నెలల పాప ఉన్నారు. ప్రసవం కోసమని పుట్టింటికి వెళ్లిన ఝాన్సీ ప్రసవానం తరమూ పుట్టింటి వద్దే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో భార్యాబిడ్డల్ని చూసివద్దమని ప్రసన్న కుమార్ తన బంధువుల ఆటోను తీసుకుని మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వెంకటాపురానికి మంగళవారం బయలు దేరాడు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర తర్వాత ఆటో బొల్లాపల్లి టోల్‌గేట్ దాటిన తర్వాత నారినవారిపాలెం సమీపంలోని పెట్రోల్ బంకు దగ్గరల్లో జాతీయ రహదారిపై కుక్క అడ్డం వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. ఆటోను నడుపుతున్న ప్రసన్నకుమార్ రోడ్డుపై పడడంతో అతనిపై ఆటో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆటోలో మృతుని తోపాటు ఉన్న గుడిమెట్ల గోవర్ధన్, దావల వెంకీకి స్వల్ప గాయాలయ్యాయి. మరో 20 నిముషాల్లో గమ్యం చేరాల్సిన వారు ప్రమాదంలో మృత్యువాత పడడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

మృతుడు ప్రసన్న విద్యార్థి దశలో గుంటూరు నగరంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)లో పని చేశారు. అనంతరం ప్రజానాట్య మండలిలోనూ పనిచేశారు. ప్రస్తుతం డప్పు కళాకారునిగా జీవనం సాగిస్తుండంతోపాటు వ్యవసాయ పనులు, ఆటో నడుపుతూ ఉంటాడు. మృతునికి తల్లిదండ్రులతోపాటు భార్య, ఇద్దరు పిల్లలు, ఇద్దరు సోదరులు ఉన్నారు. మృతుని తల్లి అంగన్వాడీ టీచర్‌కాగా తండ్రి వ్యవసాయ పనులు చేస్తుంటారు.

క్రీడా దుస్తులను అందిస్తున్న జెడ్‌పిటిసి మల్లు స్వామి, హెచ్‌ఎం దుర్గాభవాని

విద్యార్థినులకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు క్రీడా దుస్తులు మంగళవారం పంపిణీ చేశారు. అల్ ఇండియా బంజారా సేవాసంఘ్ ఉపాధ్యక్షులు బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్, తాళ్లపల్లి సర్పంచ్ గాలయ్య, మాజీ జెడ్‌పిటిసి శేరెడ్డి గోపిరెడ్డి, వీరారెడ్డి సహకారంతో విద్యార్థినులకు క్రీడా దుస్తులు అందజేసినట్లు హెచ్‌ఎం దుర్గా భవాని తెలిపారు. వీటిని విద్యార్థినులకు జెడ్‌పిటిసి ఎం.స్వామి ద్వారా అందించారు. వార్డెన్ యాకసిరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రామ్మోహన్, వెంకటేశ్వర్లు, మల్లీశ్వరి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, వినాయక మట్టి ప్రతిమలనే ఉపయోగించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సోమవారం ఆయన ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా 2 వేల ప్రతిమలను సంఘ నాయకులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ చల్లంచర్ల లక్ష్మితులసీ సాంబశివరావు, కొత్త రామకృష్ణ, అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ఓట్ల సర్వే పారదర్శకంగా చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ కల్పించాలని, ఓటర్ల ప్రక్రియలో చేర్పులు, మార్పులు, తొలగింపులు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను నరసరావుపేట ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డి ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నరసరావుపేట నియోజకవర్గంలోని ఎఇఆర్‌ఒలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా ప్రీ-రివిజన్ కార్యకలాపాలు, ఇంటింటి సర్వే, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపు, ఇంటి అడ్రస్ మార్పులు తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఓటర్ల ప్రక్రియను వివరించి, సూచనలు, సలహాలు చేశారు. ఇప్పటికే వివాదాస్పద పోలింగ్ కేంద్రాల మార్పుపై ఇప్పటికే పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, రొంపిచర్ల తహశీల్దార్ బి.అంకారావు, నరసరావుపేట తహసిల్దార్ ఆర్.వి రమణ నాయక్ నరసరావుపేట మునిసిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
గుంటూరు జిల్లా
బుధవారం 20 సెప్టెంబర్ 2023

ప్రతి కుటుంబ ఆరోగ్యం జెఎఎస్ లక్ష్యం

డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ శ్రావణ్ బాబు

ప్రజాశక్తి- మంగళగిరి :ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహనరెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరు శ్రావణ్ బాబు అన్నారు. మంగళగిరి గణపతి నగర్ లోని ఇందిరానగర్ యూపీహెచ్‌సిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, హెల్త్ సెంటర్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరు శ్రావణ్ బాబు, డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజ్మెంట్ ఆఫీసర్ డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ బాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్వేని చాలా క్వాలిటీగా చేయాలన్నారు. ప్రతి కుటుంబంలో ముఖ్యమంత్రి చెప్పిన మాదిరిగా అనారోగ్య సమస్యలు ఉన్నవారిని జల్లెడ పట్టి వెలికి తీసి, వారిని హెల్త్ క్యాంపు తీసుకువచ్చి స్పెషలిస్ట్ డాక్టర్స్ చే పరీక్షలు చేయించి వైద్యం అందించాలన్నారు. ఏఎన్ఎంలు, హెల్త్ సెంటర్ సిబ్బందితోపాటు 50 మంది ఎన్నారై మెడికల్ కాలేజీ స్టూడెంట్స్ నర్సులు కూడా సర్వే చేయడానికి ముందుకొచ్చారన్నారు. సర్వేను నిర్ణయించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు సర్వేను మానిటరింగ్ చేసుకుంటూ ఎంత సర్వే అయింది, ఎంత పెండింగ్ ఉందనే విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. క్యాంపు నిర్ణయించిన తేదీకి ప్రతి ఇంటికి సర్వే బృందం వెళ్లి సర్వే పూర్తి చేయాలన్నారు. ాార్యక్రమంలో హెల్త్ సెంటర్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పీ అనూష, డాక్టర్ రమేష్, డాక్టర్ కిరణ్, డాక్టర్ షేక్ మొబీనా, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆలపాటి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎల్బీనగర్లో ఇందిరానగర్ డాక్టర్ వైయస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను డిఎంహెచ్వో డాక్టర్ శ్రావణ్ బాబు, డిపిఎంఒ డాక్టర్ రత్నం మన్మోహన్ లు తనిఖీ చేశారు.

ప్రజాశక్తి-తెనాలి:జగనన్న ఆరోగ్య సురక్షపై ఆరోగ్య సిబ్బందికి, వార్డు వాలంటీర్లుకు మంగళవారం స్థానిక 13వ వార్డు చినరావూరు కమ్యూనిటీహాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్ఓ చెన్నకేశవులు జగనన్న సురక్ష ప్రాధాన్యత, అమలు చేసే విది విధానాలను వివరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వార్డు వాలంటీర్లు ఇంటింటికి తిరిగి జనన్న సురక్షపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎ.బాలచంద్రమౌళి, లిల్లీ, ఆశావర్కర్ సౌజన్య, వార్డు వాలంటీర్లు అనిత, విమల, మాధవి, అన్వేష్, రాజ్‌కిషోర్ పాల్గొన్నారు.

తొమ్మిదవ రోజుకు ఎంఆర్‌పిఎస్ దీక్షలు

ప్రజాశక్తి - చేబ్రోలు :పార్లమెంట్ సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కొనసాగుతున్న దీక్షలు చేబ్రోలులో 9వ రోజుకుచేరాయి. దీక్షా శిబిరంలో ఎంఆర్‌పిఎస్ పొన్నూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మురికిపూడి హృదయ రాజు మాదిగ మాట్లాడుతూ ప్రస్తుత ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టేలా కేంద్రం పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. దేశావ్యాప్తగా, రాష్ట్రవ్యాప్తంగా ఎస్ సి వర్గీకరణ సాధనే లక్ష్యంగా నిరాహార దీక్షలు చేయడం జరుగుతుందని అన్నారు. ఎస్ సి లు అంటే మాల మాదిగలే కాదు ఎస్ సి కులంలో 59 ఉప కులాలు ఉన్నాయని తెలిపారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎస్ సి కులం లోని ఉపకులాల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు అందరికీ సమానంగా న్యాయ బద్దంగా అందడంలేదని, ఎస్ సి లను ఏబిసిడిలుగా వర్గీకరించాలని అన్నారు. ఇదే ప్రధాన డిమాండుతో ఎం ఆర్ పి ఎస్ పోరాటం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో డేగల బాబు మాదిగ, ఆలూరి బాబు వెంకటేష్ మాదిగ, ఉన్నం ఆనంద్ మాదిగ, కారుమూరి మంగరాజు మాదిగ పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

సమస్యల పరిష్కారమే అజెండా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తెనాలి

ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిక పరిష్కారం చూపటమే అజెండాగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. రూరల్ గ్రామం కొలకలూరు ఎస్టీ కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే అధ్యక్షతన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. వార్డు సచివాలయాల సిబ్బంది ఆయా సమస్యలను నమోదు చేసుకున్నారు. తొలుత గ్రామ మాజీ సర్పంచ్ ప్రసాదం భాస్కరరావు సమాధి వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్ళలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చిందన్నారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన ప్రసాదం నాగప్రసాదకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి రూ. 75వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, నాయకులు పి బాల గురవమ్మ, పి అనిల్ కుమార్, రాధారావు, కాలిశెట్టి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఎఎన్ఎంలకు 100 బిపి పరికరాలు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గణపతి నగర్ లోని ఇందిరానగర్ డాక్టర్ వైయస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే) సొంత నిధుల నుంచి ఎంటీఎంసీ పరిధిలోని 12 యూపీహెచ్సీలోని ఏఎన్ఎం లకు 100 డిజిటల్ బీపీ ఆపరేటర్స్‌ను ఉచితంగా అందించారు. ముఖ్య అతిధిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్త లూరు శ్రావణ్ బాబు హాజరై ఎమ్మెల్యే ఆర్కే పంపిన డిజిటల్ బీపీ ఆపరేటర్స్ ను ఆయా హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లకు అందజేశారు. అనంతరం డాక్టర్ శ్రావణ్ బాబు మాట్లాడుతూ ఇటీవల స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కేను సర్వేకు 100 డిజిటల్ బీపీ ఆపరేటర్స్ కావాలని అడగటంతో వెంటనే స్పందించి ఆయన సొంత నిధులతో ఆపరేటర్స్ పంపించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కేకు హెల్త్ డిపార్ట్మెంట్ తరపున ధన్యవాదాలు తెలియ జేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో డీపీఎమ్ ఓ డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పీ అనూష, డాక్టర్ రమేష్, డాక్టర్ కిరణ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఏ శ్రీమన్నారా యణ, హెల్త్ సెంటర్ సూపర్వై జర్స్ పట్టెం లాజర్, జయలక్ష్మి పాల్గొన్నారు.

తహశీల్దార్ సమక్షంలో శాంతి సమావేశం

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలు మండలంలోని నారాకోడూరు మరియు గుండవరం గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా గొడవలు జరిగాయని తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, ఎస్ కె ఆనంద్ తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఆగ్రామాల్లో శాంతి వాతావరణం నెలకొల్పేందుకు ఇరు వర్గాలతో గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో అల్లర్లకు కారణమైన 10 మంది పై బైండవర్ చేయడం జరిగింది తెలిపారు. నారా కోడూరు గ్రామంలో వినాయకుని బొమ్మ ఏర్పాటు క్రమంలో గంటన్నర సమయం జరిగిన ట్రాఫిక్ అంతరాయం, అలజడుల నేపథ్యంలో ఇరువర్గాల వ్యక్తులతో అల్లర్లు, అలజడి జరగకుండా ఇరువర్గాలతో మాట్లాడి పెద్దల సమక్షంలో బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు.

విద్యుత్ శాఖకు సహకరించండి

ప్రజాశక్తి - కాకుమాను : మండల పరిధిలోని గ్రామస్తులు విద్యుత్ మీటర్లు ఇంటి లోపల, కార్యాలయాల్లో ఉండటం వలన విద్యుత్ నమోదు చేసే హెల్పర్లకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ శాఖ వారు ప్రతి ప్రతి ఇంటికి, కార్యాలయాలకు విద్యుత్ మీటర్‌ను ఎటు వంటి ఖర్చు లేకుండా ఇంటి వెలుపుల బిగించడం జరుగు తుందని, దీనికి మండల పరిధిలోని ప్రజలు సహకరిం చాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రతీకార రాజకీయాలు తగదు

ప్రజాశక్తి - తుళ్లూరు :జగన్ మోహన్ రెడ్డికి 151 అసెంబ్లీ సీట్లు కట్టబెట్టింది సమర్ధ వంతమైన పాలనను అందించమని తప్ప ప్రతీకార రాజకీయాలు నెరపేందుకు కాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ మెండెం కోటేశ్వరరావు అన్నారు. తమ ప్రత్యర్థి పార్టీలను బలహీన పరిచేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను వినియోగించి ప్రతీకార రాజకీయాలు చేయడం బిజెపికి అలవాటుగా మారిందని, రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి కూడా అదే పంథాను అనుసరిస్తున్నారని మండి పడ్డారు. తుళ్లూరులో మంగళవారం ఆయన మాట్లాడుతూ, వైసిపి నాయకులు పాలనను గాలికొదిలేశారని, ప్రతీకార రాజకీయాల ద్వారా ప్రతిపక్షాలను అణగదొక్కి ఎన్నికలలో గెలవాలని చూస్తున్నారని అన్నారు. బిజెపి, వైసిపి పోకడలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, రానున్న ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతారని విశ్వాసం వెలిబుచ్చారు. పవన్ కళ్యాణ్ ఎన్‌డిఎ ను వీడి ఇండియా కూటమిలో చేరాలని కోరారు.

నేడు పానకం విక్రయ హక్కుకై వేలం

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పర్వతంపై పానకాల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఏడాది పాటు భక్తులకు పానకం తయారు చేసి విక్రయించే హక్కుకై ఈనెల 20వతేదీ ఆలయ దిగువ సన్నిధి లో ఇ-టెండర్ కం సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఇవో రామకోటిరెడ్డి మంగళవారం తెలి పారు. ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు. గత ఏడాది రూ.కోటి 54లక్షలకు పాడుకున్నారు.

నేడు 'నువ్వు నవ్వించు' కార్యక్రమం

ప్రజాశక్తి -గుంటూరు సిటీ :ప్రతి నెల అవగాహన సంస్థ ఆధ్వర్యంలో హాస్య ప్రియుల కొరకు నిర్వహించే నువ్వు నవ్వించు కార్యక్రమం అరండల్ పేట 15/1లోని కుబేరా టవర్స్ లో జరుగుతుందని అవగాహన సంస్థ నాయకులు కొండా శివరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులను హాయిగా ఆనందంగా ఉంచేలా నిర్వహించబడే ఈ కార్యక్రమంలో కామెడీ, కిడ్స్ హాస్య, వ్యంగ్యంగా పాడే పాటలు, కవితలు, పేరడీ గీతాలతో అలరిస్తాయి అన్నారు. కార్యక్రమాన్ని ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ బి.వి రామ్ కుమారి ప్రారంభిస్తారని తెలిపారు. పి హాస్యం వల్ల స్ట్రెస్ తగ్గి బీపీ షగర్ కంట్రోల్ లోకి తేవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.

వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి గుంటూరు సిటీ

జిల్లాలోని 18-45 సంవత్సరల యువకులకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ (డిఎల్టీసీ) కాలేజీ ప్రిన్సిపాల్ బి సాయి వరప్రసాద్ మంగళవారం తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు త్వరలో క్లాసులు ప్రారంభిస్తామన్నారు. అసిస్టెంట్ ఎలక్ట్రిషన్‌కు పదో తరగతి పాస్ అయి ఉండాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు 10 తరగతి కంటే తక్కువ చదువుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8074607278, 9704668909 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఎంపికైన యువతకు శిక్షణ అనంతరం పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామన్నారు.

కళాకారులకు డప్పులు, గజ్జలు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వృత్తి కళాకారులను ఆదుకునేందుకు, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ స్ఫూర్తితో ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం టిడిపి కార్యాలయంలో మేరీ మాత డప్పు కళాకారుల బృందానికి మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్‌రావు డప్పులు, కాళ్లకు గజ్జలు, డ్రెస్సులను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి గ్రామ కార్యదర్శి మద్దినేని సుబ్రమణ్యం, కాట్రగడ్డ నాగేశ్వరరావు, వంగూరి బీముడు, వడ్డేశ్వరం అబ్రహం, కాట్రగడ్డ గోపాలకృష్ణయ్య, కత్తిక శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నోటీసులు ఇవ్వడం సరికాదు : సిపిఐ

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

మదర్ థెరిసా కాలనీ, అమరారెడ్డి నగర్ కాలనీలో గత 40 సంవత్సరాలుగా నివాసముంటున్న పేద ప్రజలకు నోటీసులు ఇవ్వడం సరైంది కాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి మదర్ థెరిసా కాలనీ, అమరారెడ్డి నగర్ ప్రాంతా ల్లో సిపిఐ నేతల బృందం మంగళవారం పర్యటించింది. ఈ సందర్భంగా జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను తొలగించాలని అధికారులు నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. కాలనీ వాసులకు వారు నివాసం ఉన్న చోటనే నిలపట్టాలు ఇవ్వాలని, తక్షణమే ప్రభుత్వం స్పందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్న తిరుపతయ్య, ముసునూరు సుహాన్, జాలాది జాన్ బాబు పాల్గొన్నారు.

వైసిపి పట్టణ అధ్యక్షులు వేణుకు సన్మానం

ప్రజాశక్తి-తాడేపల్లి

సిఎం జగన్ ఆదేశాల మేరకు వైసిపి పట్టణ అధ్యక్షులుగా ఎన్నికైన బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డిని కృష్ణనగర్ వైసిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బొకె అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు మాట్లాడుతూ రెండో సారి పట్టణ అధ్యక్షునిగా వేణును నియమించబడటానికి కారణమైన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, సిఎం జగన్‌కు ధన్యవాదాలు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఎం.వెంకటరామిరెడ్డి, మహేష్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, కె.రమేష్, పెదగాలయ్య, ఎస్‌కె సుభాని, ఎం.ప్రకాష్, ఉమాదేవి పాల్గొన్నారు.

జాతీయ జట్టుకు విజయ్ కుమార్ ఎంపిక

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజస్థాన్ రాష్ట్రం ఉదయం పూర్‌లో ఈ నెల 28 వ తేదీ నుంచి అక్టోబర్ ఎనిమిదవ తేదీ వరకు జరిగే జాతీయ వికలాంగుల క్రికెట్ టి 20 కప్‌కు ప్రభుత్వ ఆసుపత్రి మెల్ స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న వేల్పుల విజయ్ కుమార్ ఎంపిక అయ్యారు. ఈ మేరకు ఆంధ్ర క్రికెట్ ఫెడరేషన్ ఫర్ డిస్సబ్లెడ్ విజయ్ కుమార్‌ను జాతీయ జట్టుకు ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 26న రిపోర్ట్ చేయాల్సిందిగా సమాఖ్య సూచించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ విజయ్ కుమార్‌ను అభినందించారు. జాతీయ జట్టుకు ఎంపిక కావడం అందులో ఈ ఆసుపత్రి నుంచి ప్రాతినిధ్యం వహించడం ఆనందం గా ఉందని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో క్రికెట్ లో రాణించి ప్రభుత్వ ఆసుపత్రి కి మంచి పేరు తీసుకుని రావాలని ఆయన అకాక్షించారు. జాతీయ జట్టు లో ఎంపికైన విజయ్ కు గ్లోబల్ ల్యాబ్ నిర్వాహకులు లక్ష్మణ్ రూ.పదివేలు ఆర్థిక సాయం అందచేయడం అభినందనీయమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా క్రీడాకారులను గుర్తించి సహాయ సహకారలను అందిస్తోందని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా తమ వంతు సహాయ సహకారాలను కూడా అందిస్తామని ఆయన అన్నారు. ఆసుపత్రి లోని అందరి ప్రోత్సహం తో జట్టును విజయ పథం లో నడిపించడమే కాకుండా ఆసుపత్రికి పేరు తీసుకుని వస్తానని జాతీయ క్రికెట్ జట్టు వికెట్ కీపర్ విజయ్ కుమార్ అన్నారు.

రూ. 10వేలు ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ కిరణ్

అంతర్జాతీయ వేదికల్లో గుంటూరు ఖ్యాతి చాటాలి

రవికుమార్‌కు మేయర్ కావటి అభినందన

ప్రజాశక్తి - గుంటూరు సిటి

బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్‌లో రవి కుమార్ అంతర్జాతీయ వేదికలలో గుంటూరు ఖ్యాతిని చాటాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఆకాంక్షించారు. నవంబర్‌లో జర్మనీలో జరిగే అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన ఏటుకూరు గ్రామానికి చెందిన బాడీ బిల్డర్ నిశ్శంకరరావు రవి కుమార్‌ను మంగళవారం సంపత్ నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేగా అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, రవి కుమార్ ఈ నెల 13 నుండి 17 వరకు ఫిలిప్పీన్స్ లోని సిబు నగరంలో జరిగిన ఆసియన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించడం ద్వారా నవంబర్‌లో జర్మనీలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపిక అవటం గుంటూరు నగరానికే గర్వకారణమన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ప్రతి ఒక్కరు విజేతలు అవుతారని రవి కుమార్ ఆదర్శంగా నిలిచాడన్నారు. రవి కుమార్ ఏటుకూరు గ్రామం నుండి అంతర్జాతీయ వేదిక పై సత్తా చాటుతున్నాడని, రానున్న కాలంలో ఆయన మరిన్ని విజయాలు సాధించడానికి అవసరమైన తోడ్పాటును అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో వై.యస్.ఆర్.సి.పి నాయకులు సాదు రాజేష్, గేదెల రమేష్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రవి కుమార్‌ను అభినందిస్తున్న మేయర్ తదితరులు

నాణ్యమైన ఆహారం ఇవ్వండి

జిజిహెచ్ క్యాంటీన్ తనిఖీ చేసిన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ క్యాంటిన్ నిర్వాహకులకు ఆదేశించారు. మంగళవారం రాత్రి క్యాంటిన్ లో వైద్యులకు అందించే ఆహార పదార్థం వాసన వస్తుందని సూపరింటెండెంట్ కు వైద్యులు ఫిర్యాదు చేశారు. మంగళవారం క్యాంటిన్‌ను డాక్టర్ కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటిన్ వాతావరణం పూర్తిగా అపరిశుభ్రతతో కనిపించిందని ఆయన అన్నారు. ప్రతి నెల రూ.30 లక్షలు ప్రభుత్వం నుంచి క్యాంటిన్ నిర్వాహకులకు చెల్లిస్తున్న నాణ్యమైన భోజనం అందించలేక పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్వాహకులకు డబ్బులు చెల్లించకపోతే కోర్ధులకు వెళ్లి అధికారులను కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆయన అన్నారు. రోగు లకు ప్రతి రోజు 20 నుంచి 30 మంది వరకు భోజనం పెట్టడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన చెప్పారు. ప్రభుత్వ జి ఓ ప్రకారం ఒక్కొక్క వైద్యునికి రోజుకు రూ.80 చెల్లిస్తుదని ఆయన అన్నారు. క్యాంటిన్ లో వైద్యులు, వార్డుల్లో రోగులు తింటే ప్రాణ సంకటం గా మారే ప్రమాదం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయని ఆయన చెప్పారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకుని నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆయన కోరారు. క్యాంటిన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. కూరగాయలను కోసేందుకు చక్కటి వసతి ఏర్పాటు చేయమని గతంలో చెప్పినప్పటికీ ఎలాంటి మార్పులు చేయులేదన్నారు. వారం రోజులు గడువు ఇస్తున్నానని వెంటనే పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసు కోవాలని ఆయన సూచించారు.

చేనేత, హస్త కళలను ఆదరిద్దాం

ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో అధికారులు - 25 వరకు ప్రదర్శన, విక్రయాలు

ప్రజాశక్తి - గుంటూరు

హస్త కళా వస్తువులు, చేనేత వస్త్రాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను తయారీదార్లే నేరుగా అమ్ముకునేలా నాబార్డు ఆధ్వర్యంలో క్రాఫ్ట్ అండ్ లూమ్స్ ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర మార్కెటింగ్ అండ్ కో-ఆపరేషన్, అగ్రికల్చర్ అండ్ కో-ఆపరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి తెలిపారు. స్థానిక అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో నాబార్డు వారిచే ఏర్పాటు చేయబడిన క్రాఫ్ట్ అండ్ లూమ్స్ ఎక్స్ పో వస్త్ర ప్రదర్శనను నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్.గోపాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజ నేయులు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ టి.కామేశ్వర రావులతో కలసి చిరంజీవి చౌదరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చిరంజీవి చౌదరి మాట్లాడుతూ క్రాఫ్ట్ అండ్ లూమ్స్ ఎక్స్ పో ఈ నెల 25వ తేది వరకు కొనసాగు తుందని, ఈ ఎక్స్‌పోలో మొత్తం 38 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. ఇందులో శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు ఈ ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శనలో ధర్మవరం, వెంకటగిరి, ఫణిదం, పుత్తూరు, చీరాల, ఉప్పాడ, కడప, చీమకుర్తి, కోనసీమ, ఐలాపురం, పుంగనూరు, మాధవరం, అనకాపల్లి, మదన పల్లి , ఉదయగిరి, నెల్లూరు, విశాఖపట్నం, మంగళగిరి, పొంచంపల్లి, ఆరుంబాక నుండి 34 స్టాల్స్, రెండు తెలంగాణ, 2 తమిళనాడు రాష్ట్రాల నుంచి వివిధ రకాలైన చేనేత వస్త్రాలను తక్కువ ధరకే అందుబాటులో ఉంచారని వివరించారు. ఉత్పత్తిదారులచే నేరుగా అమ్మకాలు చేస్తున్నందున ధర తక్కువగా, ఉత్పత్తి నాణ్యతగా వుంటుందన్నారు. ప్రతి సంవత్సరం చేనేత, హస్త కళాకారులను కార్మికులను ప్రోత్సహించడానికి చేనేత వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వారు మరింత నాణ్యతగా ఉత్పత్తులను తయారు చేయడానికి శిక్షణిస్తామని, పెట్టుబడినీ సమచూరుస్తామని తెలిపారు. ప్రజలు వస్త్ర ప్రదర్శనను సందర్శించి, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి, చేనేత పరిశ్రమ, కార్మికుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. జెసి రాజకుమారి మాట్లాడుతూ చేనేత కుటుంబాలు దారపు పోగులను మగ్గాలపై సృజనాత్మకతను జోడించి అద్భుతమైన వస్త్రాలు నేస్తారన్నారు. మన సంప్రదాయం, ప్రకృతి, పర్యావరణం గురించి కూడా ఆ వస్త్రాలపై జోడిస్తారన్నారు. చేనేత ఉత్పత్తులను, హస్తకళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆ కళ అందరికీ అబ్బదని, కళాకారులను ప్రోత్సహిద్దామని చెప్పారు. రాతంశెట్టి సీతారా మాంజనేయులు మాట్లాడుతూ నాబార్డు దేశానికి చేస్తున్న సేవలలో భాగంగా మన రాష్ట్రానికి ఎన్నో విధాలుగా సహాయం అందిస్తోందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు, ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు అందించడంలో నాబార్డు ముందుందని చెప్పారు. సహకార సంఘాలకు గ్రాంట్లను, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తూ రాష్ట్రాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్ర మంలో ఎల్‌డిఎం మహిపాల్‌రెడ్డి, నాబార్డు డీడీఎం జి.శరత్‌బాబు, చేనేత సోసైటీ సంఘాల ప్రతినిధులు, చేనేత, హస్త కళాకారులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలనలో ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి, జెసి తదితరులు, స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయకి ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఫెలోషిప్

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

న్యూరాలజీ రంగానికి చేసిన కృషికి భారతదేశం నలుమూలల నుండి ఎంపిక చేయబడిన ఎనిమిది మంది ప్రముఖ న్యూరాలజిస్టుల్లో డాక్టర్ విజయ ఒకరని, ఆమెకు ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ (ఫైన్) ఫెలోషిప్ రావడం చాలా సంతోషంగా ఉందని గుంటూరులోనే లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.పి.వి.రాఘవ శర్మ తెలిపారు. ఈ మేరకు మంగవారం గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుల డాక్టర్ రాఘవ శర్మ మాట్లాడుతూ సెప్టెంబరు 14 నుండి 17 వరకు మధురైలో జరిగిన 30వ వార్షిక ఇండియన్ అకాడమీ అఫ్ న్యూరాలజి 2023 సదస్సులో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి విజయ ప్రతిష్టాత్మకమైన ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఫెలోషిప్‌ను ప్రొఫెసర్ గగనీదీప్ సింగ్ చేతుల మీదగా అందుకున్నారని వెల్లడించారు.

ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ద్వారా విజయ డిఎం న్యూరాలజీని పూర్తి చేసారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పక్షవాత పేషెంట్లకు 1996 లోనే అంకినీడు స్ట్రోక్ సెంటర్‌ను స్థాపించి, దానిని దేశంలోనే మొట్టమొదటి సర్టిఫైడ్ అత్యుత్తమ అత్యాధునిక సత్వర వైద్య సేవలు అందించే అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్‌గా అభివృద్ధి చేసామన్నారు. లక్షలాది మంది పక్షవాత రోగులకు చికిత్సలుఅందిస్తున్నామనీ తెలిపారు. వైద్య వృత్తిలో 30 సంవత్సరాల అనుభవాన్ని, 50 ఒరిజినల్ రీసెర్చ్ జర్నల్ పబ్లికేషన్స్, 2 పుస్తక చాప్టర్లు, 10 అంతర్జాతీయ అవార్డులు, అనేక జాతీయ అవార్డులు, రాష్ట్ర అవార్డులు, గోల్డ్ మెడల్, 25 కంటే ఎక్కువ క్లినికల్ రీసెర్చ్ ప్రాజెక్టు, ఫాకల్టీగా, మోడరేటర్‌గా అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు డాక్టర్ విజయ హాజరయ్యారని వివరించారు. రేడియో టెలివిజన్లో చర్చలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, దాతత్వ కార్యకలాపాలను పరిగణలోకి తీసుకుని ఈ ఫెలోషిప్ ఆఫ్ ఐఏఎన్ అందుకున్నారని లలితా హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ తెలిపారు.



ప్రకృతి వైద్యంపై వివిఐటిలో అవగాహన

ప్రజాశక్తి- తెనాలి :వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరులో మంగళవారం విద్యార్థులకు ప్రకృతి వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పూణేకు చెందిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యాచురోపతి, త్రిగుణ నేచర్ క్యూర్ అండ్ హెల్త్ ట్రస్ట్ వారి సహకారంతో 'రోగ్ ముక్త్ భారత్' పేరిట ప్రకృతి వైద్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా న్యాచురోపతి వైద్యులు డాక్టర్ ఉమాసుందరి పాల్గొని మాట్లాడుతూ శరీరం సహజ సిద్ధంగా రోగాలను పరిష్కరించుకోగలిగిన సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. మంచి ఆహారం, వ్యాయామం, యోగ, పరిశుభ్రత, నిద్రతో ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చునన్నారు. జీవన విధానం, ఆహారపు అలవాట్లలో మార్పులే అనేక రోగాలకు కారణమని, వాటి మూలాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దానికి ప్రకృతి వైద్యం మెరుగైన ఫలితాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎన్ కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్ ఉమా సుందరిని సత్కరిస్తున్న కళాశాల బృందం

రోగుల భద్రతకి ప్రాధాన్యత

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ లో ఈ నెల 17 వ తేదీన జరిగిన ప్రపంచ రోగుల భద్రత దినోత్సవం లో గుంటూరు ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొని పలువురు ప్రశంస పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మంగళవారం విద్యార్థి నులను అభినందించారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి నుంచి 50 మంది విద్యార్థినులు పాల్గొన్నారని అందులో 9 మందికి ఈ పోస్టర్ ను సమర్పించారని ఆయన చెప్పారు. ఇందులో ప్రతిభ కనబర్చిన కె చంద్రిక కు రూ.రెండు వేల చెక్‌తో పాటు ప్రశంస పత్రాన్ని అందచేసినట్లు ఆయన చెప్పారు.